సాక్షి చిత్తూరు

బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



నిందితుడి అరెస్ట్

ఆలయాల్లో చోరీలకు పాల్పడే నిందితున్ని అరెస్టు చేసి ఐరాల పోలీసులు వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

- 8లో



ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ

మైనారిటీ విద్యార్థులకు ఉచితంగా గ్రూప్–2 స్టడీ మెటీరియల్‌ను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అందజేశారు.

- 8లో



ప్రభుత్వ భూముల్లో కబ్జాల పర్వం

పలమనేరు సమీపంలోని ప్రభుత్వ భూములను కబ్జా చేసిన టీడీపీ నాయకులు వెంచర్లు వేసి అమ్ముకున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

జిల్లాలో విద్యుత్ సర్వీసుల తనిఖీ

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. ఇందులో మొత్తం 3,348 సర్వీసులను తనిఖీ చేయగా తిరుపతి ఆపరేషన్ 100, తిరుపతి రూరల్ 42, పుత్తూరు 86, చిత్తూరు అర్బన్ 74, చిత్తూరు రూరల్ 51, మదనపల్లె 72, పీలేరు 60, పుంగనూరు పరిధిలో 86 కేసులు బుక్ చేశారు. ఇందులో విద్యుత్ అదనపు లోడ్ కేసులు 503 కేసులకు గాను క్రమబద్ధీకరణ రుసుం రూ.12.18 లక్షలు, చౌర్యం కేసులు 68కు గాను రూ.46 వేలు జరిమానాతో కలిపి మొత్తం 571 సర్వీసులపై కేసులు నమోదు చేసి రూ.12.64 లక్షలు చెల్లించాలని వినియోగదారులకు నోటీసులు ఇచ్చినట్లు ఎస్‌ఈ కృష్ణారెడ్డి వివరించారు.

డీఈఓగా దేవరాజు



డీఈఓ దేవరాజు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా విద్యాశాఖ అధికారిగా సి.దేవరాజును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం వైఎస్‌ఆర్ కడప జిల్లా ఏడీ–1 గా పనిచేస్తున్న ఆయనకు ఉద్యోగోన్నతి కల్పించి డీఈఓగా నియమిస్తున్నట్లు పేర్కొంది. చిత్తూరు డీఈఓ కార్యాలయంలో ఏడీగా విధులు నిర్వహిస్తున్న విజయేంద్రరావు డీఈఓ పోస్టు ఖాళీగా ఉండడంతో పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా సీనియర్లుగా ఉన్న ఏడీలకు ఉద్యోగోన్నతి కల్పించడంతో చిత్తూరు జిల్లాకు రెగ్యులర్ డీఈఓను నియమించారు. డీఈఓ పోస్టు భర్తీ చేయడంతో ప్రస్తుతం డీఈఓగా పనిచేస్తున్న విజయేంద్రరావు ఇకపై ఏడీగా పూర్వపు స్థానంలో విధులు నిర్వహించనున్నారు. నూతన డీఈఓ రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

3న టీచర్లకు ప్రొఫెషనల్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో సర్కారు స్కూళ్లలో విధులు నిర్వహిస్తున్న పలు కేడర్‌ల టీచర్లకు మార్చి 3వ తేదీన ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ పరీక్షలు జరుగుతాయని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎలిమెంటరీ గ్రేడ్‌లో ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్ ఫర్ సెకండరీ గ్రేడ్‌కు 3వ తేదీ పేపర్ 1, 2 పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సింపుల్ ఓరియన్ టేసస్ టెస్ట్ ఫర్ గ్రేడ్–1 లాంగ్వేజ్ పండిట్స్ (తెలుగు, ఇంగ్లీష్)లో పేపర్–1, ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం పరీక్ష (స్పెషల్ టీచర్)లకు రెండు పేపర్లు, పీఈటీలకు ఒక పేపర్ పరీక్ష జరుగుతుందని డీఈఓ తెలిపారు.

నేడు అన్ని స్కూళ్లు పనిచేయాలి

– డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఈ నెల 7వ తేదీన అన్ని యాజమాన్యాల పాఠశాలలు విధిగా పనిచేయాలని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం స్కూళ్లకు ఐచ్ఛిక సెలవులు ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేశారన్నారు. తప్పుడు ప్రచారాలు చేసిన వారిని గుర్తించి వారిపై కేసులు పెడతామని డీఈఓ హెచ్చరించారు.

లైసెన్స్‌లు తీసుకోవాలి



మాట్లాడుతున్న కార్మికశాఖాధికారి ఓంకార్‌రావు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని వ్యాపార, వాణిజ్య సంస్థలు, దుకాణాలు చట్టప్రకారం లైసెన్స్ తీసుకోవాలని జిల్లా కార్మికశాఖాధికారి ఓంకార్‌రావు తెలిపారు. మంగళవారం జిల్లా కార్మికశాఖ కార్యాలయంలో చాంబర్స్ ఆఫ్ కామర్స్ వారితో సమావేశమయ్యారు. దుకాణ, వాణిజ్య సంస్థలు, హోటళ్లు, సినిమా హాల్స్ మొదలైనవారు తప్పనిసరిగా కార్మిక శాఖ వారు జారీ చేసే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈనెల 29వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. సంబంధిత వ్యాపార సంఘాలు సమావేశం నిర్వహించి వీటిపై అవగాహన కల్పించాలన్నారు. సభ్యులు సచివాలయం, మీసేవాలో లైసెన్స్ పొందే విధంగా వ్యాపారులకు సమాచారం ఇస్తామని జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మహేష్ తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు రెన్యువల్ చేయించుకోవాలని చిత్తూరు సహాయ కార్మిక అధికారి జగదీశ్‌బాబు తెలిపారు. వీరితో పాటు హోల్ సేల్ క్లాత్ మర్చంట్, కిరాణసంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

పచ్చ కొట్లుడు!



కొట్టుకుంటున్న జనసేన, తెలుగు తమ్ముళ్లు

తెలుగు తమ్ముళ్లు.. జనసైనికులు పిచ్చకొట్టుడు కొట్టుకున్నారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దుల వర్షం కురిపించారు. కుర్చీలు మడత బెట్టి తన్నుకున్నారు. చేతికొచ్చిన వస్తువుతో చెలరేగిపోయారు. కర్రలతో చావబాదుకున్నారు. తమ అధినేత పవన్ కళ్యాణ్ ఫొటోలు ఫ్లెక్సీలు, బ్యానర్లలో లేవని జనసైనికులు.. తాము చెప్పినట్టు వినడం లేదని టీడీపీ వలంటీర్లు ఒకరిపై ఒకరు దాడులకు తెగబడ్డారు. ఇదంతా ఎక్కడో కాదండోయ్.. సాక్షాత్తు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సమక్షంలోనే. కనీసం వారిని వారించాల్సిన చంద్రబాబు అటు కన్నెత్తి చూడకుండా మిన్నకుండిపోవడం గమనార్హం. దీనికి గంగాధరనెల్లూరులో జరిగిన 'రా కదలిరా' సభ వేదికైంది.

చిచ్చురేపిన 'రా కదలి రా'

- గంగాధరనెల్లూరు సభలో టీడీపీ, జనసేన ముష్టి యుద్ధం
- కార్యక్రమం ఖరారైనప్పటి నుంచి జనసేన శ్రేణులకు దక్కని గౌరవం
- ఫ్లెక్సీలు, జెండాల్లో పవన్ బొమ్మ లేకపోవడంతో ఆగ్రహం
- బాబు ఎదుటే.. పవన్‌ని సీఎంని చేయాలంటూ జనసేన శ్రేణుల నినాదం
- చంద్రబాబు వస్తున్నారని ఊరూరా ప్రచారం చేసినా సభకు రాని జనం
- తమిళనాడులోని తిరుత్తణి, అత్తింజేరిపేట అద్దె జనాలను తీసుకొచ్చిన వైనం

సాక్షి, తిరుపతి : చంద్రబాబు సొంత జిల్లాలో రా కదలి రా సభ టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య చిచ్చు పెట్టింది. జనసేన శ్రేణులకు సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఇరు వర్గాలు చంద్రబాబు సమక్షంలోనే తన్నుకోవాల్సి వచ్చింది. బాబు కళ్లెదుటే ఇదంతా జరుగుతున్నా ఆయన చూసీచూడనట్లు వెళ్లిపోయారు. సభలో జరుగుతున్న పరిణామాలను గమనించిన ఓ టీడీపీ కార్యకర్త జై జగన్ అంటూ నినదించారు. టీడీపీ వలంటీర్లు అతన్ని పట్టుకుని చితకబాదారు. మొత్తంగా బాబు సొంత జిల్లాలో మంగళవారం జరిగిన రా కదలి రా సభ తుస్ మంది.

అద్దె జనాలే దిక్కు

ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు మంగళవారం గంగాధరనెల్లూరు నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన రా కదలి రా సభలో పాల్గొని ప్రసంగించారు. జిల్లా నేతల మధ్య సమన్వయం లేకపోవడం, జనంలో టీడీపీపై సదభిప్రాయం లేకపోవడంతో సభ పేలవంగా ముగిసింది. చంద్రబాబు సొంత జిల్లా కావడంతో రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా రెండు లక్షల మందితో సభను నిర్వహించాలని భావించారు. అయితే జిల్లా నేతలు జన సమీకరణ విషయంలో ఎవ్వరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. చంద్రబాబు వస్తున్నారని ఊరూరా ప్రచారం చేసినా స్థానికులు కూడా సభకు హాజరు కాలేదు. ఈ విషయాన్ని ముందే గ్రహించిన నియోజకవర్గ ఇన్‌చార్జ్ థామస్ పక్కనే ఉన్న తమిళనాడు రాష్ట్రంలోని తిరుత్తణి, అత్తింజేరిపేట నుంచి మనిషికి రూ.300 ఇచ్చి వాహనాల ద్వారా తీసుకొచ్చారు.

అయోమయంలో థామస్

రా కదలి రా సభను నిర్వహిస్తే అధినేత చంద్రబాబే స్వయంగా అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తారని హామీ ఇచ్చారు. అందుకే రా కదలి రా కార్యక్రమానికి థామస్ భారీ ఎత్తున ఖర్చుచేశారు. ఇంత చేసినా.. చివరికి గంగాధరనెల్లూరు అభ్యర్థి అని చంద్రబాబు ప్రకటించకపోవడంతో థామస్ తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. తను చెబితేనే థామస్ బయోకెమిస్ట్రీ చదివి డాక్టర్ అయ్యాడని బాబు కామెడీ చేశారు. అందుకే గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ని చేశానని ప్రకటించారు. అయితే ఎక్కడా ఎన్నికల్లో థామస్‌ని గెలిపించండి అని ప్రకటించలేదు. మండల టీడీపీ నాయకులకు థామస్ సరైన గౌరవం ఇవ్వకపోవడంతో వారు కూడా అంటీముట్టనట్లు వ్యవహరించారు. మండల నాయకులను చంద్రబాబుకు పరిచయం చేయమని అడిగినా థామస్ పట్టించుకోకపోవడంతో టీడీపీ నేతలు మౌనంగా ఎవరి దారిన వారు వెళ్లిపోవడం గమనార్హం.



జనసేన, తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ



కొట్లాటలో చొక్కాలు చిరిగాయి

జనసైనికులకు తీరని అవమానం

పొత్తులో భాగంగా టీడీపీ–జనసేన కలిసి ఎన్నికలకు వెళ్లాలన్నది అధినేతలు తీసుకున్న నిర్ణయం. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కనిపించలేదు. ఒకరంటే ఒకరికి పడడం లేదు. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో విభేదాలు ఉన్నాయి. అందుకు గంగాధరనెల్లూరులో మంగళవారం చోటుచేసుకున్న సంఘటనే నిదర్శనం. జీడీనెల్లూరులో రా కదలి రా సభ నిర్వహించాలని నిర్ణయించిన మొదలు జనసేన శ్రేణులకు ముందస్తు సమాచారం ఉండడం లేదు. పిలవాలి అనే భావనతో చివర్లో మొక్కుబడిగా ఫోన్‌చేసి పిలుస్తున్నారు. సభ సందర్భంగా టీడీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాల్లో జనసేన అధినేత పవన్ ఫొటో, స్థానిక నాయకుల ఫొటోలు లేకపోవడం తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. దీంతో సోమవారం రాత్రి మండల జనసేన అధ్యక్షుడు సురేష్‌రెడ్డి జనసేన జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మంగళవారం సభలో వెళ్తుంటే జనసేన శ్రేణులను టీడీపీ కార్యకర్తలు, వలంటీర్లు అడ్డుకున్నారు. ఆగ్రహానికి గురైన జనసేన శ్రేణులు 'పవన్ సీఎం.. జై పవన్ కళ్యాణ్' అంటూ నినాదాలు చేశారు. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని టీడీపీ శ్రేణులను వలంటీర్లు జనసేన నాయకులు, కార్యకర్తలను ఈడ్చిపడేశారు. దీంతో జనసేన శ్రేణులు తిరగబడడంతో ఇరువర్గాల మధ్య వివాదం తారస్థాయికి చేరింది. జనసేన శ్రేణులు టీడీపీ వలంటీర్లు తరిమి తరిమి కొట్టారు. చంద్రబాబు సమక్షంలోనే ఇంత జరుగుతున్నా వారించకుండా చూసీచూడనట్లు వెళిపోయారు.

మహిళల్లో ఆత్మస్థైర్యం నింపిన జగనన్న



ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళల స్థాయి పెరిగింది
- మంత్రి ఆర్‌కే రోజా
- ఘనంగా ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం

నగరి : మహిళల్లో ఆత్మస్థైర్యం నింపిన నేత సీఎం జగనన్న అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల మైదానంలో ఆసరా చెక్కుల పంపిణీ సందర్భంగా ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో ఆమె పాల్గొన్నారు. నగరి మున్సిపల్, మండల పరిధిలో 1,480 స్వయం సహాయక సంఘాలకు రూ.15.59 కోట్ల చెక్కును ఆమె అందజేశారు. అనంతరం మహిళలతో కలిసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చితికిపోయిన 7.98 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని సుమారు 78.94 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు సీఎం జగనన్న ఊరటనిచ్చారన్నారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ మేరకు 4 విడతల్లో రూ.25571 వేల కోట్లు రుణాలను ఆసరా ద్వారా స్వయం సహాయక సంఘ మహిళలకు సంపూర్ణంగా మాఫీ చేసిన నాయకుడు జగనన్న అన్నారు. సంఘాలు దీనస్థితి నుంచి నేడు పటిష్ట స్థితికి చేరాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో మహిళల స్థాయి పెరిగిందని మంత్రి రోజా అన్నారు.

పసుపు–కుంకుమ పేరిట మభ్యపెట్టిన బాబు..

గత పాలనలో మహిళలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారిని మభ్యపెట్టడానికి చంద్రబాబు పసుపు–కుంకుమ ఇచ్చారన్నారు. అయితే మహిళలు కూడా చంద్రబాబుకు విశ్రాంతి ఇచ్చి ఇంటికి పంపారన్నారు. మహిళల సమస్యలను ప్రజా సంకల్పయాత్రలో జగనన్న నిశితంగా పరిశీలించారు గనుకే అధికారంలోకి వచ్చాక ప్రతి పథకం మహిళల పేరిటే అమలు చేస్తున్నారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి మహిళలకు ఇంతటి ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. తాను మంచి వ్యక్తికి ఓటు వేశానని ప్రతి మహిళ నేడు తలెత్తుకు తిరుగుతోందన్నారు. ఆసరా కార్యక్రమానికి విచ్చేసిన మహిళలే వై నాట్ 175 అన్న జగనన్న మాటలకు సాక్ష్యమన్నారు. ఉక్కుకవచంలా మహిళాశక్తి జగనన్నకు అండగా ఉందన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ రాధమ్మ, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, ఎంపీపీ భార్గవి, మెప్మా అధికారి సునీత, మున్సిపల్ వైస్‌చైర్మన్లు, మండల వైస్‌ఎంపీపీలు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మహిళలు

ఎంపీడీఓలకు స్థానాల కేటాయింపు

చిత్తూరు కార్పొరేషన్ : ఉమ్మడి జిల్లాకు కేటాయించిన ఎంపీడీఓలకు స్థానాలను కేటాయించారు. ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన వారికి పోస్టింగ్స్ ఇచ్చినట్లు జెడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి మంగళవారం రాత్రి వివరాలను ప్రకటించారు. నెల్లూరు జిల్లా నుంచి 17మంది, వైఎస్సార్ కడప జిల్లా నుంచి 13 మంది ఎంపీడీఓలు జిల్లాకు రాగా కలెక్టర్ షణ్మోహన్ వారికి జిల్లాలో మండలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

ఎక్కడెక్కడ ఎవరెవరంటే..!

చిత్తూరుజిల్లా : చిత్తూరు జిల్లాలో ఎంపీడీఓలుగా చౌడేపల్లెకి వెంకటేశు, గుడుపల్లెకి గోపి, కార్వేటినగరానికి శ్రీధర్ నాయుడు, నగరికి రవికుమార్‌రెడ్డి, నింద్రకు భవాని, పెనుమూరుకు వెంకటేశ్వరరావు, పులిచెర్లకు సురేష్‌బాబు, పుంగనూరుకు వెంగమునిరెడ్డి, యాదమరికి సింగయ్య, పూతలపట్టుకు ప్రసన్నకుమారి, సోమలకు వరప్రసాద్, వి.కోటకు గోవర్ధన, తవణంపల్లెకి వెంకటేశ్వర్లు, విజయపురానికి బ్రహ్మయ్య, గంగాధరనెల్లూరుకు భాస్కర్‌ను నియమించారు.

తిరుపతి జిల్లాలో..

తిరుపతి జిల్లా: తిరుపతి జిల్లాకు ఎంపీడీఓలుగా బీఎన్‌కండ్రిగకు షాలెట్, చంద్రగిరికి సూర్యసాయి, కేవీబీపురానికి శివప్రసాద్, పాకాలకు నాగేంద్రబాబు, రామచంద్రాపురానికి ప్రత్యూష, తొట్టంబేడుకు ఇసాక్ ప్రవీణ్, వడమాలపేటకు సుజాతమ్మ, ఎర్రావారిపాళ్యంకు మధుసూదనరావును నియమించారు.

అన్నమయ్య జిల్లాలో..

అన్నమయ్య జిల్లా: అన్నమయ్య జిల్లాలో బి.కొత్తకోటకు నూర్జహాన్, గుర్రంకొండకు, జగదీశ్వరరెడ్డి, కేవీపల్లెకి రెడ్డయ్య, కలికిరికి రామకృష్ణయ్య, నిమ్మనపల్లెకి మైదిలీ, పెద్దమండ్యంకు వెంకటరామయ్య, తంబళ్లపల్లెకు కృష్ణమూర్తి నియమితులయ్యారు.

భక్తులు సంతృప్తి చెందేలా అర్చకత్వం

- శ్వేత సంచాలకులు భూమన్



మాట్లాడుతున్న శ్వేత సంచాలకులు భూమన్

తిరుపతి(అలిపిరి): భక్తులు సంతృప్తి చెందేలా అర్చకత్వం చేయాలని శ్వేత సంచాలకులు భూమన్ అన్నారు. మంగళవారం శ్రీవేంకటేశ్వర ఉద్యోగుల శిక్షణ సంస్థ(శ్వేత) ఆధ్వర్యంలో మూడు రోజుల పునశ్చరణ తరగతులు తిరుపతిలోని ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పునశ్చరణ తరగతులతో అర్చకులు పాండిత్యాన్ని సంపాదించవచ్చన్నారు. వైఖానస ఆగమంలోని నిగూఢమైన విషయాలను తెలుసుకుని, భక్తులు సంతృప్తి చెందేలా అర్చకత్వం చేయాలని కోరారు. ఈ తరగతుల్లో ఆరోగ్యసూత్రాలపై శిక్షణ ఇస్తామన్నారు. పాంచరాత్ర, శైవాగమ అర్చకులకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఎస్వీ వేదవర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ ఆగమాలు సాక్షాత్తు భగవంతుడు ఉపదేశించినవని, అలాంటి ఆగమాల్లో పేర్కొన్న విధంగా ఆలయాల్లో సంప్రదాయబద్ధంగా అర్చకత్వం చేయాలని కోరారు. ఇలాంటి పునశ్చరణ తరగతులు అర్చక వ్యవస్థ పటిష్టానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకుల్లో ఒకరైన శ్రీ వేణుగోపాల దీక్షితులు మాట్లాడుతూ కట్టు, బొట్టు సంప్రదాయాలను పాటించి అర్చకులు సమాజంలో ఆదర్శవంతంగా నిలవాలన్నారు. ఇలాంటి పునశ్చరణ తరగతులతో అర్చకుల నైపుణ్యం మరింత పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ వైఖానస ఆగమ సలహాదారు పి.సీతారామాచార్యులు, టీటీడీ ఆలయాల వైఖానస అర్చకులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో జూనియర్ అసిస్టెంట్



పట్టుబడిన సొమ్ముతో జయరామ ఆచారి



కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు

విజయపురం(నగరి): భూమికి సంబంధించిన ఎఫ్ఎంబీ, 1బీ అడగల్ ఇప్పించేందుకు రూ.25 వేలు డిమాండ్ చేసిన జూనియర్ అసిస్టెంట్ జయరామ ఆచారిని ఏసీబీ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. ఏసీబీ ఎస్పీ దేవప్రసాద్, డీఎస్పీ జెస్సీ ప్రశాంతి కథనం మేరకు.. విజయపురం మండలంలో గంగమాంబపురం గ్రామానికి చెందిన ఓ రైతు తన భూమికి సంబంధించి ఎఫ్ఎంబీ, 1బీ కోసం 2023 ఆగస్టులో దరఖాస్తు చేసుకున్నాడు. తనకు రూ.15 వేలు ఇస్తే వివరాలు అందిస్తానని జూనియర్ అసిస్టెంట్ జయరామ ఆచారి చెప్పడంతో ఆ రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. తహసీల్దార్ కార్యాలయంలో డబ్బును జయరామ ఆచారికి అందిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నారు. ఆయన వెంట సీఐ ఈశ్వర్, ఎల్వీనాయుడు, సునీల్‌కుమార్ ఉన్నారు.

పకడ్బందీగా సమగ్రశిక్ష కార్యక్రమాలు



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి



సమావేశంలో పాల్గొన్న సీఆర్‌పీలు

- సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : సమగ్రశిక్ష ప్రాజెక్టు పరిధిలో అమలయ్యే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని ఆ శాఖ జిల్లా ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో సీఆర్‌పీ (క్లస్టర్ రీసోర్స్ పర్సన్)లతో సమీక్ష నిర్వహించారు. హాజరైన సమగ్రశిక్ష ఏపీసీ మాట్లాడుతూ సీఆర్పీలు బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం అన్ని పాఠశాలల్లో సిలబస్ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డిజిటల్ ఎడ్యుకేషన్‌లో ఐఎఫ్‌పీ, స్మార్ట్‌టీవీలు పూర్తిగా పని చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. డీఈఓ విజయేంద్రరావు మాట్లాడుతూ నాడు–నేడు పథకంలో సరఫరా చేసిన అన్ని వస్తువులు సక్రమంగా పని చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫార్మెటివ్ అసెస్‌మెంట్–3 పరీక్షలు పూర్తయిన వెంటనే జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి విద్యార్థులకు అందజేయాలన్నారు. నిర్దీత సమయంలోపు జవాబుపత్రాలు దిద్దకపోతే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బైజూస్ ట్యాబ్‌లను ప్రతి విద్యార్థి వినియోగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమీక్షలో సెక్టోరల్ అధికారులు అజయ్‌కుమార్‌రెడ్డి, జయప్రకాష్, ప్రభాకరవర్మ, ఉదయలక్ష్మి, పల్లవి, పలు మండలాల సీఆర్పీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉచితంగా మెటీరియల్ పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : గ్రూప్–2 పరీక్షలకు హాజరవుతున్న మైనారిటీ అభ్యర్థులు ఆశయంతో చదివి పరీక్షల్లో అర్హత సాధించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని గంగనపల్లిలోని ప్రభుత్వ ఖాజీ కార్యాలయంలో మైనారిటీ అభ్యర్థులకు ఉచితంగా గ్రూప్–2 స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రూప్–2కు శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్‌ను అందజేయడం జరిగిందన్నారు. జిల్లా ప్రభుత్వ ఖాజీ సయ్యద్ కమాలుల్లా జుహారి మాట్లాడుతూ మైనారిటీ విద్యార్థుల ఉన్నతవిద్యకు రాష్ట్రప్రభుత్వం అనేక సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి సహాయం అందలేదని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సయ్యద్, కోఆప్షన్ మెంబర్ ఆను, నాయకులు అబ్దుల్ ఘని, అబ్దుల్ రషీద్, గఫార్‌ఖాన్, మునీర్, ముక్తార్ అహ్మద్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

ఐరాల: మండలంలోని పొలకల దండు మారెయమ్మ ఆలయంలో చోరీ చేసిన ఓ వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. పాకాల మండల ఫకీర్‌పేటకు చెందిన సుబ్రమణ్యం(40) ఈ నెల 2వ తేదీ దండు మారెయమ్మ ఆలయంలో రాత్రి 11 గంటల సమయంలో ఆలయ తాళాలు పగులగొట్టి, అమ్మవారి వెండి వస్తువులను దొంగలించాడు. గ్రామస్తుల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పాటూరు సంతగేటు బస్టాప్ వద్ద సుబ్రమణ్యం చోరీ చేసిన వస్తువులను, గతంలో జైల్లో పరిచయమైనా పాత నేరస్థులు రాయచోటికి చెందిన శివకుమార్, చిన్నా సహాయంతో చిత్తూరులో విక్రయించడానికి వెళ్తుండగా పోలీసులకు వచ్చిన పక్కా సమాచారంతో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి సుమారు రూ.2.10 లక్షల విలువైన అమ్మవారి వెండి ఆభరణాలు వెండి గొడుగు, బిందె, శిరస్సు, వడ్డాణం స్వాధీనం చేసుకున్నారు. సుబ్రమణ్యం గతంలో అనేక చోరీలు చేశాడని, జైలుకు సైతం వెళ్లి వచ్చాడని ఎస్‌ఐ తెలిపారు.

టీడీపీ నేతల కబ్జాల పర్వం

- గంగవరంలో ప్రభుత్వ పోరంబోకు భూమిని ఆక్రమించి లేఅవుట్
- రూ.కోట్ల విలువజేసే సర్కారు భూమి హాంఫట్
- జర్నలిస్టులకు పట్టాల సేకరణ కోసం వెళ్లగా బయటపడిన భూకబ్జా వ్యవహారం
- ప్రభుత్వభూమిగా బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు



గత టీడీపీ హయాంలో టీడీపీ నాయకులు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని వేసిన వెంచర్

పలమనేరు:ప్రభుత్వ భూములను టీడీపీ నాయకులు యథేచ్ఛగా ఆక్రమించుకుని దర్జాగా రియల్ వెంచర్లు వేసి ప్లాట్లను అమ్ముకున్న ఘటన మంగళవారం వెలుగుచూసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా.. రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇంటి పట్టాలను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. అందులో భాగంగా పలమనేరు నియోజకవర్గంలోని పలువురు జర్నలిస్టులు ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై విచారించిన అధికారులు దాదాపు 40మందిని అర్హులుగా ఎంపిక చేశారు. వారికి పలమనేరు లేదా గంగవరం రెవెన్యూలో రెండెకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాలని పలమనేరు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి రెండు మండలాల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా వారు గంగవరంలో రెండు చోట్ల ప్రభుత్వ భూములను గుర్తించారు. వాటిని పరిశీలించేందుకు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి వెళ్లారు. గంగవరం రెవెన్యూ సర్వే నంబర్ 775లో 3.60 ఎకరాలు ప్రభుత్వ గయాళు పోరంబోకుగా ఉంది. అయితే అక్కడున్న భూమిలో 1.35 సెంట్లు ఆక్రమణలకు గురైనట్టు తేలింది. పక్కనే ఉన్న 740/1, 2లకు చెందిన ఎస్.మధుబాబు అనే వ్యక్తి నుంచి 1.60 సెంట్లు, మరో డీకేటీ రైతు నుంచి ఐదెకరాలను చిత్తూరుకు చెందిన కఠారి మోహన్ అనే వ్యక్తి గత టీడీపీ హయాంలో వెంచర్ వేసి ప్లాట్లుగా విక్రయించినట్టు తెలిసింది. దీనిపై స్పందించిన ఆర్డీఓ అప్పటికప్పుడే ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని వెంచర్ ప్రహరీగోడలను కూల్చేయాలని ఆదేశించారు. వెంటనే ప్రభుత్వ భూమి అని బోర్డులను ఏర్పాటు చేయించారు.

కోట్ల విలువజేసే స్థలాలనే కబ్జా చేశారు..

గత టీడీపీ పాలనలో పలమనేరు, గంగవరం సమీపంలోని, ప్రస్తుతం ప్రభుత్వ గయాళుగా ఉన్న భూమికి పక్కనే ఉన్న పట్టాభూమిని కొన్న రియల్టర్లు అదే నంబరుపై రిజిస్ట్రేషన్లు చేసి ప్లాట్లను అమ్మినట్టు తెలుస్తోంది. పట్టణ సమీపంలోని గంటావూరు ఫ్లైఓవర్ వద్ద ఆక్రమణకు గురైన ఈ స్థలం విలువ కోట్లలో ఉంటుందని తెలుస్తోంది. కేవలం 1.60 ఎకరాల సెటిల్‌మెంట్ భూమిని కొని, దానికి ఆనుకుని ఉన్న డీకేటీ, ప్రభుత్వ భూములను కబ్జా చేసి వీటిని ఇళ్ల స్థలాలుగా విక్రయించడంలో గతంలో రెవెన్యూ అధికారులది ప్రధాన పాత్ర. పట్టా భూమి విస్తీర్ణం కంటే ఎక్కువ భూమిని ఎలా రిజిస్టార్ చేశారో అప్పటి పలమనేరు సబ్ రిజిస్ట్రార్‌కే చెల్లింది. ఇక్కడ జరిగిన భూ కబ్జాపై సమగ్రమైన విచారణ చేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ మనోజ్‌రెడ్డి తెలిపారు.

గతంలో ఇలాంటి భూలీలలెన్నో..

గంగవరం రెవెన్యూ పరిధిలోని బైపాస్ రోడ్డుకు ఆనుకుని సర్వే నంబరు 346లో 11.13 ఎకరాల ప్రభుత్వభూమి ఉంది. ఇందులో వాగు పోరంబోకుగా కొంత భూమిని కొందరు అక్రమంగా పట్టాలు చేసుకుని ఆక్రమించుకున్నట్టు తెలిసింది. హైవేకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. కొందరు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని వాటిపై కోర్టులో కేసులు సైతం పెట్టుకున్నారు. మొత్తం మీద గంగవరం రెవెన్యూలోని మొత్తం ప్రభుత్వ భూములు, వాటిల్లో జరిగిన భూ ఆక్రమణలపై సమగ్రంగా విచారించి తగు చర్యలు తీసుకోనున్నట్టు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి తెలిపారు.



భూకబ్జాపై విచారణ చేస్తున్న పలమనేరు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి

ఐపీ పెట్టిన వ్యక్తి ఊర్లోకి రావడంతో..

- తిరుగుబాటు చేసిన బాధితులు
- పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా

గంగవరం: చీటీల డబ్బు తిరిగి చెల్లించలేనంటూ కోర్టును ఆశ్రయించి ఐపీ పెట్టి ఊరు వదిలి వెళ్లిపోయిన వ్యక్తి మళ్లీ అదే ఊళ్లోకి తిరిగి రావడంతో బాధితుల నుంచి తిరుగుబాటు ఎదురైంది. గత ఆరు నెలల కిందట మండలంలోని నల్లసానిపల్లిలో చీటీల నిర్వాహకుడు శంకరయ్య రూ.కోట్లలో ప్రజల నుంచి చీటీలు వేయించుకున్నాడు. కొన్నాళ్లకు చీటీదారులంతా తమ డబ్బు చెల్లించాలని నిలదీయడంతో కోర్టును ఆశ్రయించిన అతను ఐపీ పెట్టి అప్పట్లో ఊరు విడిచి కుటుంబంతో సహా కనుమరుగయ్యారు. అయితే ఐపీ పెట్టిన వ్యక్తి ఉన్నఫలంగా నాలుగు రోజుల కిందట గ్రామంలో కుటుంబంతో సహా దర్శనమిచ్చాడు. విషయం తెలిసి దీంతో బాధితులు ఒక్కసారిగా శంకరయ్య ఇంటికి వెళ్లారు. తమను నిలువునా మోసం చేసి వెళ్లిపోయి మళ్లీ ఏమొహం పెట్టుకుని గ్రామంలోకి వచ్చావంటూ ప్రశ్నిస్తున్నారు. ఆర్నెళ్లు గడువు ఇస్తే మొత్తం అందరి డబ్బు చెల్లిస్తానని చీటీల నిర్వాహకుడు శంకర్ బాధితులను వేడుకున్నాడు. అయినా జనం ఏమాత్రం తగ్గలేదు. గత నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఇంతలో బాధితులు కొందరు మంగళవారం పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి చీటీల పేరిట తమను మోసగించిన వ్యక్తి మళ్లీ ఊళ్లోకి వచ్చాడని, అతన్ని అరెస్ట్ చేసి తమకు న్యాయం చేయాలంటూ నిరసన చేపట్టారు. సీఐ చిన్నగోవింద్ స్పందిస్తూ ఇది కోర్టు పరిధిలో ఉన్నందున జోక్యం చేసుకోలేమని పైఅధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

సచివాలయ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించండి



టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న

- విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కండి
- ట్రైనీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న

పూతలపట్టు: సచివాలయాల సిబ్బంది విధుల పట్ల బాధ్యత వహించాలని ట్రైనీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న తెలిపారు. మంగళవారం ఆమె మండలంలోని పి.కొత్తకోట సచివాలయాన్ని, పోలవరం ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సచివాలయ సిబ్బందితో వారి వారి శాఖల విధానాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే సచివాలయాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. గ్రామీణ ప్రజలు సమస్యలపై సచివాలయ మెట్లు ఎక్కినప్పుడు సిబ్బంది వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. 10 వతరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తే భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాలకు తోడ్పాటవుతాయన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ గౌరి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, సచివాలయాల సిబ్బంది ఉన్నారు.

ఫైనాన్స్ కంపెనీ అడ్వైజర్ మృతి

తిరుపతి క్రైమ్: నగరంలోని ఓ హోటల్‌లో ఫైనాన్స్ కంపెనీ అడ్వైజర్ మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి కథనం.. విజయవాడ చెందిన దుర్గాప్రసాద్(39) విజయవాడలో ఓ ఫైనాన్స్ కంపెనీకి లీగల్ అడ్వయిజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కంపెనీ పనుల నిమిత్తం సోమవారం తిరుపతికి వచ్చి హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకున్నారు. అయితే కంపెనీకి చెందిన స్నేహితులందరూ దుర్గాప్రసాద్‌కు ఫోన్ చేయగా.. ఆయన లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి రూమ్ వద్దకు వచ్చారు. మాస్టర్‌కీ తో డోర్ ఓపెన్ చేయగా అప్పటికే అతను స్పృహ కోల్పోయి కనిపించాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతను మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడు భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. అయితే మృతుడికి రెండు నెలల క్రితమే గుండెకు రెండు స్టెంట్లు వేసినట్లుగా తెలిపారు. గుండెపోటుతోనే మృతి చెంది ఉండొచ్చని డాక్టర్లు అనుమానిస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.



మృతి చెందిన దుర్గాప్రసాద్

తప్పిన పెను ప్రమాదం

- టిప్పర్‌ను తప్పించబోయి..పల్టీకొట్టిన ఆర్టీసీబస్సు
- 24 మంది ప్రయాణికులకు గాయాలు

తిరుపతి రూరల్: ఎదురుగా వస్తున్న ప్రమాదాన్ని గుర్తించిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ తత్తరపాటులో బస్సును పక్కకి తిప్పాడు. దీంతో బస్సు రోడ్డు దిగి పక్కనే ఉన్న చెరువు గుంతలో పడి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 24 మంది రక్తగాయాలతో బయటపడ్డారు. తిరుపతి రూరల్ ఎస్‌ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తిరువణ్ణామలై నుంచి తిరుమలకు వస్తోంది. మంగళవారం తెల్లవారుజామున తిరుపతి రూరల్ మండలం, గాంధీపురం పంచాయతీ పరిధిలో పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీని తప్పించబోయి అదుపుతప్పి పక్కనే గుంతలో పడింది. బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారు. వేగంగా వస్తున్న బస్సు ఒక్కసారిగా బోల్తా పడడంతో బస్సులోని 27 మంది ప్రయాణికులు గాయపడ్డారు. బాధితుల ఆర్తనాదాలతో గాంధీపురం గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. 108 వాహనంలో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. తిరుపతి రూరల్ ఎస్‌ఐ నాగేంద్రబాబు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ లారీని పోలీసులు గుర్తించారు.



క్షతగాత్రులను 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

రేపు విశ్వంలో ఉచిత నమూనా పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థలో ఈనెల 10వ తేదీ ఉదయం 9 గంటలకు నవోదయ నమూనా ప్రవేశ పరీక్షను ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ నెల 10వ తేదీన జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షకు అనుగుణంగా నమూనా ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నమూనా పరీక్ష ద్వారా లోపాలను సరిదిద్దుకుని ప్రధాన పరీక్షకు సంసిద్ధమయ్యేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఆసక్తి గల వారు హాల్‌టికెట్(అడ్మిట్ కార్డు) జిరాక్స్ కాపీతో పరీక్షకు రావాలని, వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

3.5 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

వెంకటగిరిరూరల్: రేషన్‌బియ్యం నిల్వలపై సీఎస్‌డీటీ సంధ్య దాడులు నిర్వహించి 80 బస్తాలు రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఈ ఘటన పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో చోటుచేసుకుంది. సీఎస్‌డీటీ సంధ్య కథనం.. పట్టణంలోని ఎన్టీఆర్‌కాలనీలో అక్రమ రేషన్ బియ్యం నిల్వచేసినట్టు సమాచారం అందగా.. సంబంధిత అధికారులు దాడులు నిర్వహించారు. ఓ నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 80 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన నిర్వాహకులు మాసాపేటలో కూడా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్టు తెలియడంతో అక్కడికెళ్లి పరిశీలించారు. ఆ తర్వాత ఎన్టీఆర్ కాలనీలోని నివాసంలో గుర్తించి బియ్యం వద్దకు సిబ్బంది రాగా.. అక్కడ ఉన్న బియ్యాన్ని నిర్వాహకులు మాయం చేశారు. విషయం తెలుసుకున్న సంధ్య వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నిల్వచేసిన బియ్యాన్ని తమకు అప్పగించేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట వరకు అక్కడే భీష్మించుకున్నారు. మంగళవారం ఉదయం తిరుపతి విజిలెన్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మొత్తం 550 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యంను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఏఆర్ విజయ్‌కుమార్, డీటీ సంధ్య

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

తిరుపతి లీగల్: హత్య కేసులో వైఎస్సార్ కడప జిల్లా, జమ్మలమడుగు, నాగలకట్టు, సంధ్యాలమోటుకు చెందిన బెల్లంయేసుకు జీవిత ఖైదు, రూ.1,000 జరిమానా విధిస్తూ తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి టీ.రామచంద్రుడు మంగళవారం తీర్పుచెప్పారు. కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోటేశ్వరరెడ్డి, కోర్టు మానిటరింగ్ అధికారి ఈశ్వరయ్య కథనం..నిందితుడు బెల్లం యేసు మొదట్లో కారు డ్రైవరు. తన భార్య చనిపోవడంతో అతను తిరుపతికి వలస వచ్చాడు. తర్వాత అతనికి 2021 డిసెంబర్‌లో లెప్రసీ రావడంతో కరకంబాడి రోడ్డులోని ఎస్వీ పూర్ హోమ్‌లో ఉంటూ చికిత్స తీసుకుని 2022 జూన్ 3వ తేదీన డిశ్చార్జ్ అయ్యాడు. అప్పటి నుంచి అతను భిక్షగాడిగా.. పాత వస్తువుల సేకరించే వాడిగా జీవిస్తూ బస్టాపుల వద్ద నిద్రించేవాడు. ఇదిలావుండగా ముందు నుంచి గుర్తుతెలియని వ్యక్తికి, నిందితుడు యేసుకు తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. 2022 జూన్ 26న చెర్లోపల్లి–తిరుపతి మెయిన్ రోడ్డు తాటితోపు సమీపంలోని మద్యం షాపులో నిందితుడు మద్యం తాగాడు. గుర్తుతెలియని వ్యక్తి అక్కడికి రావడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మద్యం షాపు సిబ్బంది ఇద్దరినీ అక్కడి నుంచి పంపేశారు. దీనిపై కక్ష్య పెంచుకున్న నిందితుడు, గుర్తుతెలియని వ్యక్తిని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలనుకున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి తాటితోపు సమీపంలోని వీరేష్ వెల్డింగ్ షాపు వద్ద మద్యం మత్తులో నిద్రిస్తుండగా రాత్రి సమయంలో వెళ్లి అతనిపై పెద్ద బండ రాయి వేశాడు. దీంతో గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. ఆపై నిందితుడు బెల్లం యేసు అక్కడి నుంచి పరారయ్యాడు. మరుసటి రోజు తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లికి చెందిన అప్పటి వీఆర్వో బీ.శ్యామల ఎమ్మార్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ పీ.సురేంద్రనాథ్‌రెడ్డి కేసు దర్యాప్తు చేసి 2022 జూలై 2వ తేదీన నిందితుడు బెల్లం యేసును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.



నిందితుడు బెల్లం యేసు

108, 104లో డ్రైవర్, మెకానికల్ పోస్టుల భర్తీ

చిత్తూరు రూరల్: జిల్లాలో 108, 104 సర్వీసుల్లో పని చేయడానికి మెకానికల్, డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ మోహన్‌బాబు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటాతో పాటు ఆధార్‌కార్డు, పదో తరగతి మార్క్‌లిస్ట్, ఇతర విద్యార్హత, డ్రైవింగ్ లైసెన్స్ నకలు పత్రాలతో 108, 104 జిల్లా కార్యాలయం, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరులో అందజేయాలని ఆయన పేర్కొన్నారు.

నేడు ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓలతో సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఉన్న ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓలతో బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయి అధికారులకు కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు పంపారు. ఎన్నికల ప్రక్రియపై చర్చించేందుకు జిల్లావ్యాప్తంగా ఉన్న ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓలతో ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

ఉచిత శిక్షణ

తిరుపతి(అలిపిరి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ , అప్లైడ్ న్యూట్రిషన్‌లో హౌస్ కీపింగ్ ట్రైనీ, ఫుడ్ అండ్ బేవరేజెస్ సర్వీస్ అసిస్టెంట్ కోర్సుల్లో యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ తిరుపతి జిల్లా అధికారి ఆర్ లోకనాథం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై 18 నుంచి 45 సంవత్సరాలలోపు వయసున్న వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు 'స్కిల్ ఇండియా సర్టిఫికెట్'తోపాటు ప్రముఖ హోటళ్లలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 11వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 8143576866, 9100558006, 9966601867 ఫోన్‌నంబర్లను సంప్రదించగలరని కోరారు.

ఎస్వీయూలో 9న జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈనెల 9వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని, సుమారు 700 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ చదివిన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు https:// forms.gle/qa6D15dwmwxXv2 o7 లింక్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7989810194 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

జిల్లా జైలులో ఖైదీ మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని జిల్లా జైలులో ప్రకాష్ (31) అనే ఖైదీ మృతి చెందాడు. టూటౌన్ సీఐ ఉలసయ్య కథనం మేరకు.. కార్వేటినగరానికి చెందిన ప్రకాష్ అనే వ్యక్తి పోక్సో కేసులో అరెస్టయ్యాడు. గత కొన్ని రోజులుగా ఇతను చిత్తూరు జిల్లా జైలులో అండర్‌ట్రయల్ ఖైదీగా ఉన్నాడు. మంగళవారం ఉదయం జైలులోని బ్యారక్‌లో స్పృహ తప్పి పడిపోయి ఉన్నాడు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. జైలు పర్యవేక్షణా అధికారి వేణుగోపాల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో కోడి పందాలు ఆడుతున్న ఏడుగురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నగరంలోని గొడుగుమూరు వద్ద కోడి పందాలు ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వన్‌టౌన్ పోలీసులు దాడులు చేసి, ఏడుగురు నిందితులను, రూ.6200 నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు.

పంజాంలో కుక్కల స్వైర విహారం

– ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురికి గాయాలు

వెంకటగిరి రూరల్: మండలంలోని పంజాం దళితవాడలో కుక్కలు స్వైరవిహారం చేశాయి. ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురిని గాయపరిచాయి. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాలు. పంజాం దళితవాడలో కుక్కల బెడద ఎక్కువ. ఓ నివాసం వద్ద ఉన్న చినారులు మానస, కార్తీక్, మాలతిపై కుక్కలు దాడికి యత్నించాయి. గమనించిన అదే ప్రాంతానికి చెందిన వీరయ్య, వరలక్ష్మి, లక్ష్మమ్మ చిన్నారులను తప్పించబోయే ప్రయత్నం చేయగా కుక్కలు వారినిపై తిరగబడి దాడి చేశాయి. ఈ మేరకు గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.